

శివలింగానికి పూజలు చేస్తున్న పూజారి



హాజరైన భక్తులు..

## రెండోరోజు వైభవోపేతం.. కోటిదీపోత్సవం

- కనుల పండువగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక కల్యాణం
- కోటికాంతుల వెలుగులో ఎన్టీఆర్ స్టేడియం
- పోటెత్తిన భక్తజనం
- హాజరైన త్రిపుర రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్

కవాడిగూడ, నవంబర్15: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో తలపెట్టిన కోటి దీపోత్సవం రెండోరోజు బుధవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. రచన టెలివిజన్, భక్తిటీవీ సంయుక్త ఆధ్వర్యంలో కోటిదీపోత్సవం నిర్వాహకులు తుమ్మల నరేంద్ర చౌదరి, రమాదేవి దంపతుల నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. కోటిదీపాంతలను వెలిగించారు. దీంతో ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణమంతా భక్తజన సందోహంతో కిటకిటలాడింది. శ్రీ శివానంద భారతీ స్వామీజీ (చిందామణి మఠం, హోస్పెట), శ్రీ సర్వవిధానంత సరస్వతీ స్వామీజీ (ఆర్ష విద్యాగురుకలం, హైదరాబాద్), రాజయోగి సుదేశ్ దీదీజీ (బ్రహ్మకుమారీస్ జర్మని) నేతృత్వంలో అనుగ్రహ భాషణం చేశారు. బ్రహ్మశ్రీ డాక్టర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి కుమార్ శాస్త్రీ ప్రవచనామృతం చేశారు. భక్తులచే గణపతి విగ్రహాలకు కోటి గరికార్చన పూజను నిర్వహించారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం, మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం మూషిక వాహనం మయూర స్వామిజీని ఊరేగించారు. ఈ కోటిదీపోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిపుర రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ హాజరై పూజలు చేసి, తమ మొక్కులను తీర్చుకున్నారు.

## విద్యార్థులు ఆంత్ర పెన్యూర్లుగా ఎదగాలి



విద్యార్థులు ఆంత్ర పెన్యూర్లుగా ఎదగాలని సెల్లీ రైట్ సిస్టమ్స్ వ్యవస్థాపకురాలు, సీఈవో సృజన రఘు పాత్రుని అన్నారు. మైసమ్మగూడలోని నర్సింహ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాలు యాచించే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహా రెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ లోక నాథం, హెచ్‌వోడీ ప్రమోద హోలీస్టార్ తదితరులు పాల్గొన్నారు. *– మేడ్చల్, నవంబర్ 15*

## 24 నుంచి ఎల్‌బీ స్టేడియంలో ప్రీ క్రిస్మస్

కొండాపూర్, నవంబర్ 15 : ప్రజల క్షేమం, శాంతి, శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రీ క్రిస్మస్ వేడుకలను నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు గణిత శాస్త్రజ్ఞుడు, విద్యావేత్త, విశ్వవిద్యాలయాల వ్యవస్థాపకుడు, జీసీకే కన్వీనర్ డాక్టర్ డబ్ల్యూఎఫ్ కుముయి తెలిపారు. బుధవారం మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో రక్షణ టీవీ మీడియా మినిస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జక్కుల బెనెహూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకల వివరాలను వెల్లడించారు.

## గ్రేటర్‌లో మొదలైన చలి గాలులు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఈశాన్య దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో చలిగాలులు మొదలయ్యాయి. దీని వల్ల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.4డిగ్రీలు, గాలిలో తేమ 45 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# సమాజానికి గమ్యాన్ని నిర్దేశించే రచనలు రావాలి

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- సాహితీ పురస్కారాలను ప్రదానం చేసిన తెలుగు వర్సిటీ



సాహితీపురస్కార గ్రహీతలతో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలుగు వర్సిటీ వీసీ కిషన్‌రావు, రిజిస్ట్రార్ భట్టు రమేశ్

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15 : సమాజానికి గమ్యాన్ని నిర్దేశించే రచనలు రావాలని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సాహితీ వేత్తలకు సూచించారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో పది మంది ఉత్తమ గ్రంథ రచయితలకు 2021 సంవత్సరానికి గాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలను వర్సిటీలోని ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్లం నారాయణ ప్రసంగిస్తూ.. సాహితీవేత్తలకు పురస్కారాలను తెలుగు యూనివర్సిటీ అందజేయడం అభినందనీయమన్నారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య టి. కిషన్‌రావు ప్రసంగిస్తూ.. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యంలో ఉత్తమ రచనలను సమాజానికి అందిస్తున్న రచయితలను ప్రోత్సహించడానికి వర్సిటీ కృషి చేస్తున్నదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి పాల్గొని పురస్కార గ్రహీతల విశిష్టతను కొనియాడారు.

**పురస్కారాలు..**

పద్య కవితా ప్రక్రియలో డాక్టర్ మాడుగుల అనిల్‌కుమార్ (శ్రీగిరిజా కళ్యాణం), వచన కవితా ప్రక్రియలో తండ హరీశ్ గౌడ్(ఇన్ బాక్స్), బాల సాహిత్యంలో మాచిరాజు కామేశ్వరరావు (పాపిష్టి డబ్బు), కథానిక ప్రక్రియలో అల్లాడి శ్రీనివాస్ (ఎడారి పూలు), నవలా ప్రక్రియలో అట్టాడ అప్పల్నాయుడు (బహుళ), సాహిత్య విమర్శలో కె.పి.అశోక్‌కుమార్ (తెలుగు నవల– ప్రయోగ వైవిధ్యం), నాటకం ప్రక్రియలో యస్.డి.వి. అజీజ్ (తురేబాజ్ ఖాన్), అనువాద సాహిత్యంలో స్వర్ణ కిలారి రచన (లిప్తకాలపు స్వప్నం), వచన రచనల విభాగంలో కోడం పవన్‌కుమార్ (కరోనా@ లాక్‌డౌన్.360), రచయిత్రి ఉత్తమ గ్రంథ విభాగంలో విజయ భండారు(గణిక), పలువురు గ్రంథ రచయితలకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదు, శాలువా, జ్ఞాపికను అందజేశారు.

## ఆనంద నిలయంలో రామలింగేశ్వర ప్రతిష్ఠ మహోత్సవాలు

**గోడపత్రికను ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి**



ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 15 : కొండపాక పరిధిలోని ఆనంద నిలయం ఆవరణలో ప్రపంచం ప్రసిద్ధి చెందేలా అష్టాదశ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణం రూపుదిద్దుకుందని ఆనంద నిలయం ట్రస్ట్ సలహాదారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రిటైర్ట్ ఐఏఎస్ కేవీ రమణాచారి అన్నారు. బుధవారం కొండపాకలోని అష్టాదశ శక్తిపీఠ ఆలయ ఆవరణలో ట్రస్ట్ సభ్యులతో కలిసి ప్రతిష్ఠ మహోత్సవ శుభ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ ..ఈ ప్రాంతంలో ఇలాంటి శక్తిమయమైన మరో ఆలయాన్ని నిర్మించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. సిద్దిపేటకు చెందిన గట్టు రాం రాజేశం గుప్తా సత్ సంకల్పంతో ఆయన అందించిన కోటి రూపాయలతో అష్టాదశ శక్తిపీఠ ఆలయం పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు పుష్పగిరి పీఠాధీశ్వరులు విద్యా శంకర భారతి స్వామి, గురు మదనాంద సరస్వతి పీఠాధీశ్వరులు, మాదవనంద సరస్వతి పర్యవేక్షణలో జరగుతాయన్నారు. 23 మంది ఫౌండర్ ట్రస్టీలుగా ఏర్పడి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 3రోజుల పాటు జరిగే దైవ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అయిత నాగరాజు, మహంకాళి రాజేశ్వరరావు, పెద్ది వైకుంఠం, గట్టు అమర్‌నాథ్, గట్టు రవి, గట్టు శ్రీనివాస్, రిటైర్డ్ ఇంజినీర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

**డిసెంబర్ 16,17 తేదీల్లో టీవర్క్స్‌లో..**

## హైదరాబాద్ మేకర్స్ ఫెయిర్

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): నగరంలో ప్రతియేటా ఎంతో ప్రత్యేకంగా నిర్వహించే హైదరాబాద్ మేకర్స్ ఫెయిర్‌ను టీ వర్క్స్‌లో డిసెంబర్ 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేయడంలో యువతరాన్ని ప్రోత్సహించేందుకు హైదరాబాద్ మేకర్స్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద ప్రోటో టైపింగ్ తయారీ కేంద్రంగా ఉన్న టీ వర్క్స్‌లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సరికొత్త ఉత్పత్తులను తయారు చేయాలన్న ఆసక్తి ఉన్న వారు.. ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకొని, మేకర్స్ ఫెయిర్‌లో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు ఈ లింకు(https://docs.google.com/forms)లో సంప్రదించాలని తెలిపారు.

## టీహబ్‌ను సందర్శించిన.. కార్నెగె మెలన్ యూనివర్సిటీ ప్రతినిధులు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అత్యాధునిక టెక్నాలజీపై విద్యార్థులకు విద్యా సంస్థల్లోనే అవగాహన కల్పించేందుకు టీ హబ్.. ప్రముఖ విశ్వవిద్యాలయమైన కార్నెగె మెలన్‌తో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నది. కార్నెగె మెలన్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం టీ హబ్‌ను సందర్శించారు. అకాడమిక్ ఎక్సలెన్స్ పేరుతో యూనివర్సిటీలో విద్యార్థులు మెంటర్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించేలా టీ హబ్ చీఫ్, ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగీర్దార్ చర్చించారు. కార్నెగె మెలన్‌తో కలిసి పని చేయడంతో కొత్త టెక్నాలజీ పట్ల కళాశాల విద్యార్థులు తెలుసుకునేందుకు మెంటర్ షిప్, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించి పూర్తి స్థాయిలో ఒక కార్యక్రమాన్ని టీ హబ్ నిర్వహిస్తుందని తెలిపారు.

# దేశ ఆహార భద్రతకు అనుగుణంగా టెక్నాలజీ

- ప్రభుత్వ సహకారంతోనే మంచి ఫలితాలు
- వీసీ రఘునందన్ రావు
- పరిశోధనలు మరింత అవసరం
- డైరెక్టర్ జనరల్ డా. సునీల్ చంద్ర దూబే



సదస్సులో మాట్లాడుతున్న వీసీ రఘునందన్ రావు తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 15: దేశంలో ఆహార భద్రతకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో నూతన టెక్నాలజీ అవసరమని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి డా. రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అగ్రి వర్సిటీ ఆడిటోరియంలో మొక్కల ఆరోగ్య యాజమాన్యం – ఆవిష్కరణ, సుస్థిరత.. అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఆహార భద్రత అనే అంశాన్ని ప్రధానంగా తీసుకోవాలన్నారు. అప్పుడే భవిష్యత్ తరాలకు మంచి ఆహారం అందించ గలమన్నారు. సాగులో తెలంగాణ రాష్ట్రం మంచి ఫలితాలు సాధించిందంటే, అందుకు స్థానిక ప్రభుత్వ సహకారం ఎంతో ఉన్నదని గుర్తు చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై విద్యార్థుల ఆసక్తి పెరిగిందన్నారు. తెలంగాణలో ఈ రంగంలో ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి రంగాలు అధిక మయ్యాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాల్సి అవసరం ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు, వాటి ఫలితాలు దేశ రైతులకు చేరాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అదనపు డైరెక్టర్ జనరల్ సునీల్ చంద్ర దూబే అన్నారు. ఈ సదస్సులో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్. శారదా జయలక్ష్మి దేవి, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ) చైర్మన్ శరత్‌బాబు, ధనూక అగ్రిటెక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ చైర్మన్ ఆర్.జి.అగర్వాల్, బయోటెక్ ఈస్థటిక్ సీఈఓ డా. కెఆర్‌కె. రెడ్డి, పీజేటీఎస్ఏయూ మాజీ ఉప కులపతి డా. ప్రవీణ్‌రావు, జగదీశ్వర్, కేప సింగ్, తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రోత్సహించడం, సస్యరక్షణ సంబంధిత పరిశోధనా రంగంలో పని చేస్తున్న శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలన్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి, మొక్కల సంరక్షణ, ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో దేశంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 500 మంది ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ విద్యార్థులు పాల్గొన్నారు.